సాక్షి ములుగు

శనివారం | 6 | జూలై | 2024



నైపుణ్యపెంపుతో ఉద్యోగ అవకాశాలు

నైపుణ్య పెంపుతో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలంటున్నారు నిపుణులు. - 8లో▸



మృత్యువై వచ్చిన కారు - 8లో▸

పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న వారిపై కారు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఆటోను కారు ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0⁰ /26.0⁰

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

పది రోజుల్లో సర్వే పూర్తిచేయాలి



మంగపేట: బిల్ట్ ఆధీనంలో ఉన్న భూమిని పది రోజుల్లో సర్వే పూర్తి చేసి నివేదిక అందజేయాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) మహేందర్‌జీ ఆదేశించారు. మండల పరిధిలోని కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిని అదనపు కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. బిల్ట్ ఆధీనంలో ఉన్న భూములను గుర్తించేందుకు చేపట్టిన సర్వే వివరాలను సర్వేయర్ సఫియాను అడిగి తెలుసుకున్నారు. గోదావరి ఇంటెక్‌వెల్ వద్ద బిల్ట్ ఆధీనంలో ఉన్న భూమిని కబ్జా చేసి సాగుభూమిగా మార్చిన ప్రాంతాన్ని పరిశీలించారు. బిల్ట్ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములు కబ్జాలో ఉన్న వారికి వెంటనే గుర్తించి నోటీసులు జారీ చేసి భూమిని స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్ వీరస్వామి, ఆర్‌ఐ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రాజనర్సయ్య పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి



ములుగు: వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని వికలాంగుల హక్కుల పోరాటసమితి(వీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు మంచోజు చంద్రమౌళి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో పోలీసులు అడ్డుకోవడంతో సుమారు అరగంట పాటు అక్కడే బైఠాయించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ అడ్మినిస్ట్రేటీవ్ అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ వికలాంగులకు పెన్షన్‌ను రూ.4,016 నుంచి 6వేలకు పెంచాలన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, గీత కార్మికులకు రూ. 2,016 నుంచి 4వేలకు పెంచాలని కోరారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి బస్‌పాస్ సౌకర్యం కల్పించాలన్నారు. వికలాంగుల హక్కుల చట్టం 2016ను పూర్తి స్థాయిలో అమలుచేయాలని కోరారు. బ్యాక్ లాగ్ పోస్టుల్లో 10శాతం, ప్రభుత్వ రంగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో వికలాంగులకు 5శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కొడారి సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంటలసాగులో సస్యరక్షణ చర్యలు



ములుగు రూరల్: పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర అన్నారు. మండల పరిధిలోని రాంచంద్రాపురంలో వ్యవసాయ, పశుసంవర్ధక, హర్టికల్చర్ అధికారులు రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ పంటల సాగులో విత్తనాల ఎంపిక ముఖ్యమన్నారు. వాతావరణానికి అనుగుణంగా విత్తనాలను సాగు చేసుకొని అధిక దిగుబడులు సాధించాలన్నారు. రైతులు పంటల సాగులో నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. రైతులకు ఆధునిక పద్ధతిలో పంటలపై డ్రోన్ సహాయంతో మందు పిచికారీ చేసే విధానాన్ని తెలియజేశారు. అనంతరం జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవికుమార్ మాట్లాడుతూ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న వివిధ స్కీంలతో పాటు వర్షాకాలంలో జీవాల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. హర్టికల్చర్ అధికారి అనసూయ మాట్లాడుతూ రైతులు ఆయిల్ పామ్ సాగు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీపై వివరించారు. పండ్ల తోటలు, మిర్చి సాగులో తీసుకోవాల్సిన మెలకువలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మునుకుంట్ల సంతోష్, హర్టికల్చర్ అధికారి కల్యాణి, స్నేహ రైతుసంఘం సభ్యులు, ఐఎఫ్‌ఎఫ్‌సీఓ కంపెనీ అధికారి విశాల్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికులకు భరోసా

ఆపరేషన్ స్మైల్, ముస్కాన్‌తో చిన్నారుల భవితకు బాటలు

- ప్రతిఏటా జనవరి, జూలైలో అధికారుల తనిఖీలు
- 2019 నుంచి ఇప్పటివరకు 768 చిన్నారులకు విముక్తి
- కొనసాగుతున్న మరో విడత



ఇటుక బట్టీల వద్ద వలస కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

ములుగు రూరల్: వివిధ కారణాలతో చదువు మానేసి బాల కార్మికులుగా మారిన పిల్లల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. నిరుపేద కుటుంబాలలోని పిల్లలు హోటళ్లు, కిరాణం దుకాణాలు, ఇటుక బట్టీలు, బైక్ మెకానిక్ షాపుల్లో పనులు చేస్తున్న వారిని గుర్తించి వెట్టిచాకిరి నుంచి కాపాడి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం 2014 నుంచి ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని ప్రతిఏటా జనవరి 1నుంచి 31వరకు ఆపరేషన్ స్మైల్, జూలై 1నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ పేరుతో కార్యక్రమాలు చేపడుతోంది. కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమశాఖ, పోలీస్ శాఖ, చైల్డ్ హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను అధికారులు జిల్లాలో ముమ్మరంగా చేపడుతున్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలు చదువు మానేసి కార్మికులుగా మారిన వారి వివరాలు సేకరించి అదుపులోకి తీసుకుంటున్నారు. అదుపులోకి తీసుకున్న బాల కార్మికుల పరిస్థితులను బట్టి వారికి అందుబాటులో ఉండే పాఠశాలల్లో అడ్మిషన్లు ఇప్పించి చదువు చెప్పిస్తున్నారు.

ఇప్పటికే 768మందికి విముక్తి

జిల్లాలోని తొమ్మిది మండలాల్లో ప్రతీ ఏడాది జనవరి, జూలై నెలల్లో ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను అధికారులు 2014 నుంచి నిర్వహిస్తున్నారు. ములుగు జిల్లా ఏర్పాటు అయిన 2019 నుంచి ఇప్పటి వరకు 768 మంది బాల కార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించారు. బాలల రక్షణ కమిటీల ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాలలో బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న



యజమానులపై లేబర్ యాక్టు కింద కేసులు నమోదు చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి ఇటుక బట్టీలు, క్రషర్లలో పనులు చేసేందుకు వచ్చిన కార్మికుల పిల్లలను అందుబాటుల్లో ఉన్న పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. బాల కార్మికులను గుర్తించి, బడీడు పిల్లలను బడిలో చేర్పించకుండా ఉన్న పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు పాఠశాలలకు పంపించేందుకు అంగీకార పత్రాలను రాయిస్తున్నారు.

2019నుంచి గుర్తించిన బాల కార్మికుల వివరాలు

సంవత్సరం	మాసం	గుర్తించిన బాలకార్మికులు
2019	జనవరి	19
	జూలై	58
2020	జనవరి	138
	జూలై	30
2021	జనవరి	190
	జూలై	47
2022	జనవరి	129
	జూలై	30
2023	జనవరి	32
	జూలై	32
2024	జనవరి	63

గుర్తించిన చిన్నారులను పాఠశాలలో చేర్పించాం..



జిల్లాలోని తొమ్మిది మండలాల్లో దాడులు నిర్వహించి గుర్తించిన బాల కార్మికులను పాఠశాలల్లో చేర్పించాం. అంతే కాకుండా బాల కార్మికుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాం. 18ఏళ్ల వయసు లోపు ఉన్న పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరం. లేబర్ యాక్టు ప్రకారం యజమానులు శిక్షకు అర్హులవుతారు. ప్రతీ ఏడాది జనవరి, జూలై మాసాలలో ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలి.

-ఓంకార్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి

పెంచుకోండి.. పంచుకోకండి!



కొందరు ప్రేమతో.. మరికొందరు స్టేటస్ చూపడానికి.. ఇంకొందరు ఇంటికి రక్షణ కోసం మూగజీవాల్ని పెంచుతూ ఉంటారు. అనాదిగా మూగజీవాలతో మనిషికి విడదీయలేని బంధం. అయితే వీటి ఆరోగ్యంపై ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. సరైన సమయంలో టీకాలు వేయించకపోయినా.. అపరిశుభ్రంగా ఉన్నా.. వాటి ద్వారా ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వీటినే జూనోసిస్ (జంతువులు, మానవుల మధ్య వ్యాపించే ఏవియన్ ఫ్లూ, రేబిస్, రిఫ్ట్ వ్యాలీ ఫీవర్ వంటివి) వ్యాధులు అంటారు. ఈనేపథ్యంలో రేబిస్ అరికట్టేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా పశు సంవర్థకశాఖ ఆధ్వర్యంలో, కొన్ని ప్రైవేట్ సంస్థలు ఉచితంగా రేబిస్ టీకాలు వేస్తున్నాయి. నేడు (శనివారం) జూనోసిస్ డే సందర్భంగా జంతుప్రేమికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'సాక్షి' కథనం.

– హన్మకొండ /కాజీపేట/కాజీపేట అర్బన్

- పెంపుడు జంతువుల ద్వారా ప్రాణాంతక వ్యాధులు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

నేడు జూనోసిస్ డే



జంతువులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెంపుడు జంతువులు వేల సంఖ్యలో ఉంటాయని వెటర్నరీ అధికారుల అంచనా. ట్రైసిటీ వాసులు 7 వేల కుక్కలు, 2 వేల పిల్లులు, 500లకు పైగా పక్షులను పెంచుకుంటున్నారు. నగరంలో 28 వేల వీధి కుక్కలున్నట్లు అధికారులు చెబుతున్నారు. రోజుకో చోట పిల్లలు, పెద్దలపై కుక్కల దాడులు జరుగుతూనే ఉన్నాయి. కాగా పెంపుడు జంతువుల్ని సాకుతున్న వారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వైద్యులు తెలిపిన సూచనల ప్రకారం..

ముందస్తు జాగ్రత్తలు..

- జంతు ప్రేమికులు ఎప్పటికప్పుడు చేతులు కడుక్కోవాలి. జంతువులను పరిశుభ్రంగా ఉంచాలి.
- మనుషులతో సన్నిహితంగా ఉండే జంతువులకు టీకాలు వేయించాలి. పశు వైద్యుడు సూచించిన టీకాల షెడ్యూల్‌ను కచ్చితంగా పాటించాలి.
- జూనోటిక్ వ్యాధులు, వాటి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ముందస్తుగా గుర్తించడం వల్ల వ్యాప్తిని నివారించవచ్చు.
- బయట తిరిగే, పెంపుడు జంతువులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. వాటిపై ఉన్న క్రిములను తొలగించాలి.
- కుక్కలు, పిల్లులకు 42 రోజుల నుంచి వ్యాక్సిన్ షెడ్యూల్‌ను తయారు చేసుకోవాలి.
- వ్యాక్సిన్స్ ఇవ్వడం ద్వారా రాబీస్‌తో పాటు వివిధ రకాల బ్యాక్టీరియాలు,రింగ్‌వార్మ్ వంటి రోగాల నుండి దూరం చేయవచ్చు.
- నాణ్యమైన ఫుడ్ అందజేయడం, పరిశుభ్రమైన స్థలంలో నివాసం ఏర్పాటు చేయాలి.

అవగాహన అవసరం..

- జూనోటిక్ వ్యాధుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి.
- జంతు ఆరోగ్యంపై అధికారులు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే సదస్సుల్లో పాల్గొనాలి.
- జంతువుల్లో అనారోగ్య లక్షణాలను గమనిస్తుండాలి. వాటి ప్రవర్తన, ఆకలి, రూపంలో మార్పులు రావడం, రోజువారీకంటే అసాధారణంగా కనిపిస్తే వెంటనే పశువైద్యుడిని సంప్రదించాలి.
- ఇవి పశుపోషకులు, పెంపుడు జంతువుల యజమానులు, వ్యవసాయ రైతులకు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. వీరు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలి.

జూనోసిస్ డే ఎలా వచ్చిందంటే..

జూనోటిక్ వ్యాధులు జంతువులు, మానవుల మధ్య సంక్రమించే అనారోగ్యాలు. పిచ్చికుక్క కాటుకు గురైన వ్యక్తికి జూలై 6, 1885న ఫ్రెంచ్ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ మొదటి టీకాను విజయవంతంగా అందించాడు. ఆ రోజునుంచి ప్రతీ ఏడాది ఇదే రోజున ప్రపంచ జూనోసిస్ డేగా జరుపుకుంటున్నారు.

క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలి..



మూగజీవాలు అమితమైన ప్రేమను కనబరుస్తుంటాయి. నేటి ఆధునిక యుగం, యాంత్రిక జీవనంలోనూ మూగ జీవాలను సాదుకునేందుకు చాలా మంది ఆసక్తి కనబరుస్తున్నారు. ట్రైసిటీలో కుక్కలు, పిల్లులు పెంచుకునేందుకు ఎక్కువ ఇష్టపడుతున్నారు. కుక్కలు, పిల్లులకు మూడు నెలలకోసారి వ్యాక్సిన్‌తో పాటు పశువైద్యశాలకు చికిత్స నిమిత్తం తీసుకురావాలి.

- డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పశువైద్యాధికారి, వడ్డేపల్లి

అడవుల సంరక్షణతోనే మానవాళి మనుగడ

అడిషనల్ సీసీఎఫ్ రామలింగం

ఏటూరునాగారం: అడవుల సంరక్షణతోనే మానవాళికి మనుగడ ఉంటుందని అటవీశాఖ అడిషనల్ సీసీఎఫ్ రామలింగం అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో అటవీశాఖ 75వ వనమహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటుగా ముఖ్యఅతిథిగా ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ, డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జాదవ్ హాజరుకాగా విద్యార్థులతో కలిసి వారు మొక్కలను నాటారు. అనంతరం రామలింగం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలను నాటాలన్నారు. అడవులను రక్షించుకోవాలని సూచించారు. మొక్కలను పెంచడం వల్ల ఉండే లాభాలను విద్యార్థులకు వివరించారు. ప్రణాళికతో చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం



మొక్కకు నీరు పోస్తున్న ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ

సౌత్ రేంజర్ అబ్దుల్ రెహమాన్, నార్త్ రేంజర్ బలరాజు, డీఆర్‌ఓ నరేందర్, ప్రహ్లాద్, అప్సరున్నీసా, సాంబయ్య, ఎఫ్‌ఎస్‌ఓ రవీందర్, రవి, షాఖన్, ఎఫ్‌బీఓలు దయానంద్, సాగర్, రవికాంత్, కల్యాణ్, శ్రీనాథ్, రమేష్, పవన్, అమీర్‌పాషా, రఘురామ్, జ్యోతి, అనూష, మనోహర్, రాజేంద్రప్రసాద్, బేస్ బేస్ క్యాంప్ సిబ్బంది, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరదలపై అప్రమత్తం

ఏటూరునాగారం: వరదలపై అప్రమత్తంగా ఉండాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ భూపేంద్ర కుమార్ అన్నారు. మండల పరిధిలోని మత్స్యకారులు, గజ ఈతగాళ్లతో ఐటీడీఏలో విపత్తులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు ఎన్‌డీఆర్‌ఎఫ్ అందించే సేవలపై వివరించారు. వరదలతో ముంపు ఉంటే వెంటనే సమాచారం అందిస్తే రక్షిస్తామని వివరించారు. కోయగూడ ఎల్లాపురం వద్ద రోడ్డు మార్గం లేదని, జీడివాగు ఉప్పొంగితే నాలుగు గ్రామాల ప్రజలు బయటకు వచ్చే పరిస్థితి ఉండదని మాజీ సర్పంచ్ ఆనంద్ తెలిపారు. అక్కడ పడవ ఏర్పాటు చేయాలని కోరారు. వరదల సమయంలో జాలర్లు తమకు సహాయంగా ఉండాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అలవర్చుకోవాలి

డీఈఓ పాణిని

గోవిందరావుపేట: విద్యార్థులు పర్యావరణ పరిరక్షణను విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని డీఈఓ పాణిని అన్నారు. మండల పరిధిలోని చల్వాయి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని ఎకో క్లబ్స్ ఎస్‌జీఎస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ అధ్యక్షతన సైన్స్ విభాగం అనుబంధంగా పోయెట్రీ రైటింగ్, పోస్టర్ మేకింగ్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. పోయెట్రీ రైటింగ్‌లో మొదటి బహుమతిగా రూ.1,000 ములుగులోని బిట్స్ హైస్కూల్‌కు చెందిన పి.గమనస్వేచ్ఛ అందుకున్నారు. రెండో బహుమతి రూ.500 వెంకటాపురం(ఎం)జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని జె.అంజలి అందుకోగా మూడో బహుమతి రూ.400 ములుగులోని సెయింట్ ఆంటోనిస్ హైస్కూల్‌కు చెందిన బి.కుసుమత అందుకున్నారు. అదే విధంగా పోస్టర్ మేకింగ్ పోటీల్లో మొదటి బహుమతిగా రూ.1000 తాడ్వాయిలోని కేజీబీవీకి చెందిన వి.ఉమారాణి అందుకోగా రెండో బహుమతి రూ.500చల్వాయి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన వి.పూజ అందుకున్నారు. మూడో బహుమతి రూ.400 బండారుపల్లిలోని టీజీఎంఎస్ విద్యార్థి దర్శన అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ పాణిని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి సైన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయిలో



విద్యార్థిని గమనస్వేచ్ఛకు బహుమతి అందజేస్తున్న డీఈఓ పాణిని

సైన్స్‌పై మక్కువను పెంచుకోవాలన్నారు. సైన్స్‌పై అవగాహన పెంచుకుంటే నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాటం మల్లారెడ్డి, నోడల్ అధికారి సోమారెడ్డి, న్యాయ నిర్ణేతలు కార్తీక్ రెడ్డి, పద్మ, ధనలక్ష్మీలు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో విద్యార్థులు పాల్గొనాలి

ఏటూరునాగారం: పాఠశాలలు, కళాశాలల స్థాయిలో ఎలాంటి పరీక్ష పోటీలు జరిగినా విద్యార్థులు పోటీలకు హాజరు కావాలని డీఈఓ పాణిని అన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్నత పాఠశాలలలో విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కవితల పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలలో రామన్నగూడెం పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కె.సుష్మశ్రీ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థాయిలో నిలిచారు. ఈ విద్యార్థినికి డీఈఓ బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా సుష్మశ్రీని హెచ్‌ఎం కొయ్యడ మల్లయ్య, ఉపాధ్యాయులు శ్యామ్‌సుందర్‌రెడ్డి, భూమిరెడ్డి, సూర్యనారాయణ, రమాదేవి, రాంబాబు, వెంకటేశ్వర్లు అభినందించారు.

'బొగ్గు గనుల వేలం వద్దు'

భూపాలపల్లి అర్బన్: సింగరేణి బొగ్గు బ్లాకుల వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలోని గణేష్ చౌక్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ, మానవహారం ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీకి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ముస్క సమ్మయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు హాజరై మాట్లాడారు. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగినటువంటి సింగరేణిని తెలంగాణ ప్రాంతంలో కనుమరుగు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని అన్నారు. సింగరేణి జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. సింగరేణిని కాపాడుకోవడం కోసం పలు దఫాలుగా ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ టీఎస్.దివాకర

మంగపేట: వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ టీఎస్.దివాకర అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ శుక్రవారం సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరు కూడా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చూడాలన్నారు. ఎక్కడైనా వ్యాధుల బారిన పడితే తక్షణం అక్కడకు వెళ్లి వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతీ దరఖాస్తును స్వీకరించి స్వీకరణ, పరిష్కారమైన తేదీలను నమోదు చేయాలన్నారు. రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వరద ముంపు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ఆయా కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలన్నారు. పారిశుద్ధ్యం విషయంలో అధికారులు గ్రామాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశానికి ముందు ఎంపీడీఓ కార్యాలయం పక్కన బస్టాండ్ నిర్మాణానికి ఆర్టీసీకి అప్పగించిన ప్రభుత్వ స్థలాన్ని ఆయన పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే బస్టాండ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.



తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

హేమాచలక్షేత్రంలో ప్రత్యేక పూజలు

మండల పరిధిలోని మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని కలెక్టర్ టీఎస్.దివాకర శుక్రవారం సందర్శించి స్వయంభు స్వామివారిని దర్శించుకున్నారు. మొదటిసారిగా ఆలయానికి వచ్చిన కలెక్టర్‌కు ఆలయ అధికారులు, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రధానాలయంలోని స్వయంభు స్వామివారికి కలెక్టర్ కుటుంబసభ్యులు గోత్ర నామాలతో ఆలయ పూజారి పవన్‌కుమార్ ఆచార్యులు, ఈశ్వర్‌చంద్ శర్మ ప్రత్యేక అర్చన చేసి స్వామివారి చరిత్ర, ఆలయ పురాణాన్ని వివరించి, వేద ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి తుల రవి, తహసీల్దార్ వీరస్వామి, ఎంపీడీఓ కృష్ణప్రసాద్, వరంగల్ 2డిపో డీఎం సురేష్ పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపో స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

డిపో నిర్మాణానికి ప్రతిపాదనలు

ఏటూరునాగారం: ఆర్టీసీ డిపో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డులో కేటాయించిన బస్సు డిపో స్థలాన్ని శుక్రవారం కలెక్టర్ ఆర్టీసీ అధికారులతో కలిసి పరిశీలించారు. 1991లో ఆర్టీసీ డిపో మంజూరు చేయగా అనివార్య కారణాలతో పనులు ఆగిపోయినట్లు స్థానికులు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం అక్కడ ఉన్న 3.32 ఎకరాల స్థలంలో కొత్త భవనం, వాహనాల సర్వీసింగ్, బంక్, సీసీ రోడ్లు తదితర నిర్మాణాలను చేపట్టాల్సి ఉంటుందని వివరించారు. ఆర్టీసీ డిపో ఏర్పాటుపై వరంగల్ 2 డిపో మేనేజర్ సురేష్‌కుమార్‌తో చర్చించారు. ఆయన వెంట ఈఈ భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలని ధర్నా

ములుగు రూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల సమయంలో హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో 25 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలతో మెగా డీఎస్సీ నిర్వహించాలన్నారు. గ్రూప్–2, 3 నోటిఫికేషన్లు జారీ చేయాలన్నారు. 317, 46 జీఓ నంబర్లను తీసివేసి స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తున్న బీజేవైఎం నాయకులను పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. అరెస్టు చేసిన బీజేవైఎం నాయకులను విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, భూక్య రాజునాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, కృష్ణాకర్, గాదం కుమార్, మల్లేష్, రాజశేఖర్, యాదగిరి, తిరుపతిరెడ్డి, యాద సంపత్, హరీశ్, సిద్ధు, ప్రవీణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

స్కూల్ బస్సు ఢీకొని మహిళ మృతి


లక్ష్మి(ఫైల్)

కాశిబుగ్గ: స్కూల్ బస్సు ఢీకొని ఓ మహిళ మృతి చెందిన ఘటన క్రిస్టియన్‌కాలనీలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ క్రిస్టియన్‌కాలనీకి చెందిన గబ్బేట లక్ష్మి(49) ఉదయం పాల ప్యాకెట్ తీసుకు రావాడానికి కిరాణ షాపునకు వెళ్లి తిరిగి రోడ్డు దాటుతుంది. అదేసమయంలో హంటర్ రోడ్డు త్రివి హై స్కూల్‌కు చెందిన బస్సు ఢీకొట్టింది. దీంతో లక్ష్మి తీవ్ర గాయాలపాలై అక్కడిక్కడే మృతి చెందింది. ఈఘటనతో బయాందోళనకు గురైన డ్రైవర్ గుర్రం శ్రీనివాస్ బస్సు ఆపకుండా సరాసరి స్కూల్ వద్దకు తీసుకెళ్లాడు. బస్సు డ్రైవర్ అతివేగంగా ఆజాగ్రత్తగా నడపడంతో తన తల్లి మృతి చెందిందని మృతురాలి కుమార్తె రాజ్యలక్ష్మి మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లయ్య తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని ..


ప్రమీల (ఫైల్)

నర్మెట: ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతిచెందిన ఘటన జనగామ జిల్లా నర్మెట మండలంలోని కన్నెబోయిన గూడెంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బిచ్చాల ప్రమీల (50) మహిళాసంఘం మీటింగ్‌కు హాజరై రాత్రి 9.30 గంటలకు ఇంటికి తిరిగి వస్తుంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన దిండిగాల గణేశ్ ద్విచక్రవాహనంపై అతివేగంతో ఎదురుగా వచ్చి ఢీ కొట్టడంతో తీవ్రగాయాలు కావడం తోపాటు కాలు, చెయ్యి విరిగాయి. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలి స్తుండగా మృతిచెందింది. ప్రమీల భర్త సిద్ధ య్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దరాప్తు చేస్తున్నటుల ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

అంగీకారపత్రాల అందజేత



నూతన పాలకమండలి సభ్యులతో రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ నూతన పాలకమండలి సభ్యులుగా నియమితులైన వారు శుక్రవారం తమ అంగీకారపత్రాలను రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డికి అందజేశారు. రిజిదస్ట్రార్ మల్లారెడ్డి క్యాంపస్‌లోని అకాడమిక్ కమిటీ హాల్‌లో వారితో సమావేశమయ్యారు. పాలకమండలి సభ్యులుగా నియమితులైనట్లుగా తొలుత రిజిస్ట్రార్ వారికి ఉత్తర్వులు అందజేశారు. అనంతరం వారి నుంచి అంగీకార పత్రాలను తీసుకున్నారు. అంగీకార పత్రాలు అందజేసినవారిలో ప్రొఫెసర్ బానోతు సురేష్‌లాల్, డాక్టర్ భీరాధి సుకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బొద్దిరెడ్డి రమ, డాక్టర్ మల్లం నవీన్, వివిధ రంగాల్లో ప్రముఖల కేటగిరిలో అనితారెడ్డి, పుల్లూరి సుధాకర్, డాక్టర్ చిర్ర రాజు ఉన్నారు. వీరిని రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య పలువురు బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు. మరో ఇద్దరు పాలకమండలిసభ్యులు యూనివర్సిటీ లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుదర్శన్, న్యాయవాది మధుబాలు చౌహాన్ ఈనెల 6న అంగీకార పత్రాలు రిజిస్ట్రార్‌కు ఇవ్వనున్నట్లు సమాచారం.

నైపుణ్య పెంపుతో ఉద్యోగ అవకాశాలు




కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు

రోజురోజుకూ పెరుగుతున్న పోటీ

- విషయపరిజ్ఞానం అవసరం
- అవకాశాలు అందిపుచ్చుకోవాలంటున్న నిపుణులు
- పట్టుదలతో లక్ష్యసాధన

కాజీపేట: నైపుణ్య పెంపుతో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలంటున్నారు నిపుణులు. కోర్సు చదివామా? పూర్తి చేశామా? అన్న చందంగా కాకుండా లక్ష్య సాధన కోసం కృషి చేస్తే తప్పక విజయం సాధిస్తారనేది వాస్తవం. ప్రస్తుత కాలంలో చాలామంది యువకులు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి కూడా ఖాళీగా ఉంటున్నారు. ఇప్పటి వరకు కష్టపడి చదివేశాం. కాస్తంత విశ్రాంతి తీసుకుందామనుకుంటే.. పొరపాటే.. ప్రస్తుత కాలంలో యువత ఆలోచనల్లో ఎటువంటి మార్పులు రావడం లేదనే చెప్పవచ్చు. మిగితా రాష్ట్రాల యువతతో పోలిస్తే మన రాష్ట్రంలో ఎక్కువ మంది యువత ఎలాంటి లక్ష్యాన్ని ఎంచుకోవడంలేదు.. ఫలితంగా ఖాళీగానే ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. యువత కాలేజీ రోజుల్లోనే మనం ఏం చేయగలం, ఏ దారిలో వెళితే భవిష్యత్ బాగుంటుంది.. అన్న విషయాన్ని గమనించి ఆ దిశగా అడుగులు వేస్తే జీవితం సుఖమయంగా సాగుతుంది. ఏ స్కిల్స్ ఉంటే రాబోయే పోటీ ప్రపంచంలో పరిస్థితులను ఎదుర్కొగలమనే విషయాలను యువత గమనించుకోవాలి. కానీ, నేటి తరం యువత ఆ దిశగా ఆలోచించకపోవడంతో రోజు రోజుకూ నిరుద్యోగుల సంఖ్య పెరుగుతోంది. చాలా మందికి ఎంత టాలెంట్ ఉన్నా.. తగిన ఉద్యోగం లభించదు. దానికి కారణం కేవలం స్కిల్స్ లేకపోవడమే. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే జీవితంలో హాయిగా జీవించాలంటే నైపుణ్యాలను పెంపోందించుకోవాలి. ప్రస్తుత జాబ్ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలు అందిపుచ్చుకోవడం వల్ల ఏ చదువు చదివినా.. అందుకు తగ్గట్టుగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ప్రస్తుత ప్రపంచానికి కావాల్సింది మంచి స్కిల్ ఉన్న యువత. ప్రపంచంలోని టెక్నాలజీకి తట్టుకునేలా యువత అడుగులు వేయాలి. కొంతమంది యువత కనీసం ఇంటర్వ్యూలను కూడా ఎదుర్కొలేక చతికిల పడిపోతున్నారు. ఇప్పటి యువత డ్రీమ్ జాబ్ సాఫ్ట్‌వేర్ ఈ రంగంలో ఉద్యోగం సంపాదించాలంటే స్కిల్స్ ఎంతో అవసరం.

డిజిటల్ మార్కెటింగ్..

ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంతో పోటీగా ఉద్యోగాలు ఇస్తూ యువతను ఆకట్టుకుంటుంది డిజిటల్ మార్కెటింగ్ రంగం. రాబోయే రోజులన్నీ డిజిటల్ మార్కెటింగ్ మీదనే ఆధారపడి ఉంటాయని నిపుణుల అంచనా. ఏ వస్తువు కొనాలన్నా ఆన్‌లైన్‌లోనే చేస్తుండడంతో ఈ రంగానికి డిమాండ్ పెరిగింది.

ఇంగ్లిష్‌పై పట్టు తప్పనిసరి..

ప్రస్తుతం ఒక మంచి ఉద్యోగం సాధించాలంటే ఇంగ్లిష్ వచ్చి ఉండాలి. ఆంగ్ల భాష రాకపోవడం వల్ల చాలా మంది యువత ఉద్యోగ అవకాశాలను చేజార్చుకుంటున్నారు. ఇంగ్లిష్ మీద మంచి పట్టు సాధిస్తే ఎలాంటి రంగంలోనైనా యువతరం ఉద్యోగాన్ని దక్కించుకోవచ్చు. ఏ రంగంలోనైనా విజయాన్ని కైవసం చేసుకోవచ్చు.

ప్రోగ్రామింగ్..

ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగం ఎంతగానో అభివృద్ధి చెందింది. దీంట్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉంటున్నాయి. కావున ఇందుకు తగ్గట్టుగా.. ప్రోగ్రామింగ్ టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి. యువత ఇలాంటి ప్రోగామింగ్ మీద ఎక్కువ శ్రద్ధ చూపించి నైపుణ్యం పొందితే జీవితం బంగారు మయమే అవుతుంది.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



యువత జీవితంలో రాణించడానికి లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకోవాలి. కష్టపడి చదివితే అనుకున్న బాటలో నడవడంతోపాటు చక్కటి జీవితాన్ని అనుభవించవచ్చు. లేదంటే జీవిత ప్రయాణం ముళ్ల బాటగా మారకతప్పదు.

– మార్క వెంకటమల్లయ్య, రిటైర్డ్ హెచ్‌ఎం

విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలి



విద్యార్థులు చదవుల తోపాటు అన్ని అంశాలపై పట్టును కలిగి ఉండాలి. విషయ పరిజ్ఞానం లేకపోతే ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడం కష్టం. విద్యార్థులు కళాశాల స్థాయిలోనే స్కిల్స్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించాలి.

– తాళ్ల వంశీ, డైరెక్టర్, తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల

చదువుకున్న దొంగ..!

- ఎంబీఏ చదివి.. సైబర్ నేరాలకు పాల్పడుతున్న యువకుడు
- అరెస్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్ కుమార్

వరంగల్ క్రైం: ఓయువకుడు ఎంబీఏ వరకు చదివాడు.. జల్సాలకు అలవాటుపడి ఈజీ మనీ కోసం దొంగదారిని ఎంచుకున్నాడు.. తనకున్న కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని నిరుద్యోగుల నుంచి డబ్బులు దండుకునే చర్యలకు పాల్పడ్డాడు. చివరకు కటకటాల పాలయ్యాడు. ఈఘటనకు సంబంధించి సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్‌కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానంటూ నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయాలు వసూలు చేసిన సైబర్ నేరస్తుడిని వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ విభాగం పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి, నిందితుని నుంచి రూ.2లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా చట్రాయి మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన పొనగంటి సాయితేజ ఎంబీఏ వరకు చదివి, కొన్ని కంపెనీల్లో పెట్టుబడి పెట్టి నష్టపోయాడు. అదేసమయంలో జల్సాలకు అలవాటుపడి, సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. తనకున్న కంప్యూటర్ పరిజ్ఞానంతో ఉద్యోగ అవకాశాలు కల్పించే వెబ్‌సైట్లలో వివరాలు నమోదు చేసుకున్న నిరుద్యోగుల సెల్‌ఫోన్ నంబర్లను సేకరించాడు. బ్యాక్ డోర్ ద్వారా సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని నమ్మించాడు. స్పందించిన నిరుద్యోగుల నుంచి ఇంటర్వ్యూ, పరీక్షలు, ట్రెనింగ్ పేరిట రూ.లక్షల్లో వసూళ్లు చేసేవాడు. ఇదే తరహాలో హనుమకొండకు చెందిన ఓ నిరుద్యోగి నుంచి సుమారు రూ.మూడు లక్షలకుపైగా వసూలు చేసి ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో బాధితుడు వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశాడు. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఈక్రమంలో నిందితుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 35మంది నిరుద్యోగుల నుంచి రూ.45లక్షల వరకు వసూలు చేసినట్లు అంగీకరించాడు. ఇదిలా ఉండగా.. కమిషనరేట్ పరిధిలో సైబర్ క్రైమ్స్ విభాగం ఏర్పాటు చేసిన కొద్ది కాలంలోనే కేసు నమోదు చేసి నిందితుడిని పట్టుకున్న ఏసీపీ విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రవి, ఎస్సైలు శివ, చరణ్ కానిస్టేబుళ్లను సీపీ అభినందించారు.


నిందితుడి అరెస్టు చూపుతున్న సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్ కుమార్

మృత్యువై వచ్చిన కారు

ఎదురుగా వచ్చి ఆటోను ఢీకొట్టిన కారు

- ఆటోడ్రైవర్‌తోపాటు, ఇద్దరు మృతి
- మరో ముగ్గురి పరిస్థితి విషమం
- మహబూబాబాద్ జిల్లాలో ఘటన


బంధు మల్లేశ్, భూక్యా నరేశ్, పైండ్ల కొమురయ్య (ఫైల్)

సాక్షి, మహబూబాబాద్/దంతాలపల్లి: పనులు ముగించుకొని ఇంటి వస్తున్న వారిపై కారు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఆటోను కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఆటో డ్రైవర్ తోపాటు ఇద్దరు మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రం సమీపంలోని వరంగల్– ఖమ్మం ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన పైండ్ల కొమురయ్య (48) భార్య మంజుల, కుమార్తె అంజలి బంధువు కుమార్తె అక్షయతో కలిసి మహబూబాబాద్ మండలం అమనగల్ గ్రామానికి వెళ్లి వస్తున్నారు. సాయంత్రం కావడంతో తొర్రూరు బస్టాండ్ సమీపంలో తొర్రూరు మండలం వెలికట్ట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బంధు మల్లేశం(45) ఆటో తీసుకొని బీరిశెట్టిగూడెం బయలుదేరారు. ఎలక్ట్రికల్ మోటారు షాపులో పనిచేస్తూ ఇంటికి తిరిగి వచ్చేందుకు బీరిశెట్టిగూడెం శివారు వాల్యాతండాకు చెందిన భూక్యా నరేష్(25) కూడా అదే ఆటోలో ఎక్కాడు. దంతాలపల్లి దాటిన తర్వాత ప్రధాన రహదారిపై ఖమ్మం నుంచి దంతాలపల్లికి వస్తున్న కారు.. ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ బంధు మల్లేశ్(45), పైండ్ల కొమురయ్య(38), భూక్యా నరేష్(25)లు అక్కికక్కడే మృతిచెందారు. ఆటోలో ఉన్న మంజుల, అంజలి, అక్షయలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వరంగల్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్, స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మహబూబాదాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.


నుజ్జునుజ్జయిన ఆటో

పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాల్లో శుక్రవారం ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర పీజీ కోర్సుల నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పరీక్షా కేంద్రంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. వీరివెంట ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతి ఉన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ (అటానమస్)లో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షలు ఈఏడాది ఏప్రిల్ –మే నెలలో నిర్వహించారు. ఈ మేరకు ఆయా సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం ఆ కళాశాలలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతితో కలిసి విడుదల చేశారు. డిగ్రీ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలకు 1,026మంది హాజరుకాగా 429మంది ఉత్తీర్ణత (41.81శాతం) సాధించారని ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. నాల్గో సెమిస్టర్ పరీక్షలో 1,053మందికి 540మంది (51.28శాతం), ఆరో సెమిస్టర్ పరీక్షలో 731మందికి 526మంది (71.96శాతం) ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేశ్, పరీక్షల కోఆర్డినేటర్ డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్ భిక్షపతి, డాక్టర్ రాజు, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.


ఆర్ట్స్ కాలేజీలో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ప్రిన్సిపాల్

నూతన టెక్నాలజీతో నిరంతర విద్యుత్

చిల్పూరు/రఘునాథపల్లి: నూతన టెక్నాలజీతో నిరంతర విద్యుత్ సరఫరాలో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా ఎంపికై న నిడిగొండ, చిన్నపెండ్యాల గ్రామాల్లోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లలో జరుగుతున్న పనులను శుక్రవారం టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పరిశీలించారు. చిల్పూరు మండలం చిన్నపెండ్యాల, రఘునాథపల్లి మండలంలోని నిడిగొండ సబ్ స్టేషన్లను సందర్శించారు. మొదట సబ్ స్టేషన్ ఆవరణల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చిన్నపెండ్యాలలో ఆయన మాట్లాడారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ తెలంగాణ లిమిటెడ్ కొత్త టెక్నాలజీకి శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని అన్ని 33/11కేవీ ఫీడర్లను రియల్ టైమ్ మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ టెక్నాలజీని తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈకొత్త టెక్నాలజీతో సబ్ స్టేషన్లలో లోడ్, పవర్ ఫ్యాక్టర్, ట్రిప్పింగ్స్‌లు, బ్రేక్‌డౌన్‌లు, ఎల్‌సీలు పూర్తిగా జరిగిన సమాచారం తెలుసుకోవచ్చని అన్నారు. ఈకొత్త టెక్నాలజీ అమలు పర్చడానికి పైలట్ ప్రాజెక్టు కింద స్కోప్ స్పైండర్ అనే కంపెనీలకు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని చిన్నపెండ్యాల, నిడిగొండ సబ్‌స్టేషన్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇక్కడ పనులు పూర్తికాగానే సరఫరా పనితీరు అనుకున్న విధంగా ఉంటే టీజీ ఎన్పీడీసీఎల్ మొత్తం టెక్నాలజీ అమలు చేస్తామన్నారు. దీంతో మానవ రహిత విద్యుత్ సబ్‌స్టేషన్లుగా మార్చవచ్చని అన్నారు. కార్యక్రమంలో సీజీఎం ఆపరేషన్ కిషన్, జీఎంఅండ్ ఐటీ శ్రీనివాస్, డీఈ టెక్నికల్ శ్రీధరాచారి, అనీల్‌కుమార్, ఎస్ఈ ఆపరేషన్ వేణుమాధవ్, డీఈ ఆపరేషన్ జనగామ లక్ష్మీనారాయణ, ఏడీఈ ఆపరేషన్ మనోహర్‌రెడ్డి, సత్యనారాయణ, డీఈ హుస్సేన్‌నాయక్, ఏఈలు రమేశ్, రాహుల్, సబ్‌ఇంజనీర్లు దిలీప్‌రెడ్డి, లైన్‌ఇన్‌స్పెక్టర్ యాదగిరి, ఎల్ఐ చంద్రశేఖర్, తిరుపతి, అశోకు, విజయ్‌కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


నిడిగొండలో నూతన పరికరాలను పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

యువకుల మృతికి కల్తీ కల్లు కారణం కాదు

- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు


రామన్నగూడెంలో రహీం ఇంటి వద్ద విచారణ చేస్తున్న నాగేందర్‌రావు

తొర్రూరు/నర్సింహులపేట: మానుకోట జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడెంలో యువకుల మృతికి కల్తీ కల్లు కారణం కాదని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు వరంగల్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు తెలిపారు. కల్తీ కల్లు, మద్యం సేవించడం వల్లే రామన్నగూడెంలో ఇరువురు యువకులు మృతి చెందారన్న ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో అధికారులు దర్యాప్తు వివరాలు వెల్లడించారు. అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు, ఏఈఎస్ ప్రవీణ్‌లతో కలిసి డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు మాట్లాడారు. నర్సింహులపేట మండలం రామన్నగూడెంలో గత నెల 10న దొంతు విజయ్ జన్మదిన వేడుకల్లో 15 మంది స్నేహితులు పాల్గొన్నారని, అదే రోజు యువకులు గ్రామంలో కల్లు, మద్యం సేవించారని, అందులో ముగ్గురు యువకులు అస్వస్థతకు గురయ్యారన్నారు. వేడుకల్లో పాల్గొన్న బోగోజు శ్రావణ్ గత నెల 17న మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడని, ఆరోగ్యం కుదుట పడకపోవడంతో గత నెల 24న ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా జాండీస్ ఉందని నిర్ధారించారన్నారు. జూన్ 30న అత్యవసర చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి యువకున్ని తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 3న మృతి చెందాడన్నారు. మరో యువకుడు రహీం పాషా సైతం వేడుకల అనంతరం ఈ నెల 2న జ్వరంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడన్నారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 3న మృతి చెందాడన్నారు. మరో యువకుడు ఉపేంద్రాచారి సైతం అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. కల్తీ కల్లు, మద్యం సేవించడం వల్లే యువకులు మృతి చెందారని ఆరోపణలు వెల్లువెత్తిన తరుణంలో సదరు గ్రామానికి వెళ్లి దర్యాప్తు చేపట్టామన్నారు. రామన్నగూడెంలో కల్లు నమూనాలను సేకరించామని కల్తీ జరిగినట్లు ఎక్కడా నిర్ధారణ జరగలేదన్నారు. కల్తీ మద్యం కారణమైతే వేడుకలో భాగంగా కల్లు తాగిన 15 మంది అస్వస్థతకు గురయ్యేవారన్నారు. కల్తీ కల్లు ప్రభావం వెంటనే చూపుతుందని, మృతులు వేడుక జరిగిన 15 రోజుల తర్వాత ఆస్పత్రిలో చేరి మరణించారని గుర్తు చేశారు. దానికి కల్తీ కల్లు కారణమై ఉండకపోవచ్చని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలిపారు. అంతకు ముందు రామన్నగూడెంలో పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వరంగల్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు విచారణ చేపట్టారు. మృతులు కల్లు తాగిన ప్రదేశాన్ని పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించామని, పోస్టుమార్టం రిపోర్టు, పోరెన్సిక్ రిపోర్టు ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రవీణ్, సీఐ నాగయ్య, ఎస్సై తిరుపతి, రజిత, సీఐ సంజీవ్, ఎస్సై సతీష్ పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం

- డాక్టర్ అమరేశ్వరి

ఖిలా వరంగల్: పల్లెల్లో పెరటి కోళ్ల పెంపకంతో మెరుగైన ఆదాయం లభిస్తుందని పీవీ నరసింహరావు తెలంగాణ వ్యవసాయ పశువైద్య విశ్వవిద్యాలయం, పశుపరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ అమరేశ్వరి తెలిపారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ హనుమంతరావు ఆధ్వర్యంలో శుక్రవారం అకిల భారత కోళ్ల పరిశోధనా స్థానం సౌజన్యంతో ట్రైబల్ సబ్ ప్లాన్ కింద ములుగు జిల్లా నిరుద్యోగ యువత, మహిళలకు కోళ్ల పెంపకం, మెలుకువలు, సూచనలపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అమరేశ్వరి శిక్షణ శిబిరం ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ మహిళలు, యువత పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి సారిస్తే అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. కోళ్ల పెంపకంపై అవగాహన పెంచుకోవాలని, కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకుని పది మందికి ఉపాధి మార్గం చూపాలని సూచించారు. అనంతరం శిక్షణకు హాజరైన 15మంది రైతులకు ఒక్కొక్కరికి పదివేల విలువైన 20పెరటి కోళ్లు, ఫీడర్స్, వాటర్స్, రాత్రి పూట ఉంచేందుకు గృహ వసతి(నైట్ షెల్టర్ కూప్స్) ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న అమరేశ్వరి

అమ్మానాన్న.. నన్ను క్షమించండి..!

- కడపలో యువకుడి ఆత్మహత్య
- అమీనాబాద్‌లో అలుముకున్న విషాదఛాయలు


రంజిత్ (ఫైల్)


రంజిత్ రాసిన సూసైడ్ నోట్

చెన్నారావుపేట: అమ్మా, నాన్నా నన్ను క్షమించండి.. మీ ఆశలు నెరవేర్చలేకపోతున్నాను.. అని సూసైడ్ నోట్ రాసి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటనకు సంబంధించి, స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన చీర మల్లేశం– కళావతిలకు కుమార్తె, కుమారుడు రంజిత్(25) ఉన్నారు. కుమార్తెకు వివాహం జరిపించారు. కుమారుడు అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేసి ఉన్నత చదువులు చదువుతూ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు రాస్తున్నాడు. ఇటీవల ఓ పోటీ పరీక్షలో తక్కువ మార్కులు రావడంతో ఉద్యోగం రాలేదని మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో స్నేహితుడు ప్రశాంత్ అక్క వివాహానికి మూడు రోజుల క్రితం తన స్నేహితులతో కలిసి వెళ్లాడు. పట్టణంలోని ఎర్రముక్కలపల్లి రోడ్డు వద్ద ఓ ప్రముఖ లాడ్జీని అద్దెకు తీసుకున్నారు. గురువారం తన స్నేహితులు టిఫిన్ చేయడానికి వెళ్లారు. రంజిత్ రాకపోవడంతో స్నేహితులు గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని ఉన్నాడు. పోలీసులకు తెలియజేసి, రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే రంజిత్ మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం రంజిత్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. చేతికొచ్చిన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు పలువురి కంటతడి పెట్టించింది.

మార్కెట్ వ్యాల్యూపై మంత్రికి నివేదిక

కాజీపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా భూమి విలువలను పెంచేందుకుగాను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి డీఐజీ సుభాషిణి, జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూముల విలువల పెంపునకు చేపట్టిన నివేదికను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అందజేసేందుకు శుక్రవారం భేటీ అయ్యారు. దీంతో మార్కెట్ వ్యాల్యూ పెంపు ప్రక్రియ తుది దశకు చేరుకున్నట్లు సమాచారం.


మంత్రితో భేటీ అయిన జిల్లా అధికారులు